క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థం

పెదకాకాని: బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదుగుదలను కోల్పోతారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. పెదకాకాని మండల పరిధిలోని కొప్పురావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహారంపై వివరించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో ఎదుగుదల లేకపోవడంతో కుటుంబ, ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పౌష్టికాహారం లోపం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారని వివరించారు. బాలికలు ఎక్కువగా నువ్వులు, వేరుశనగ, సున్ని ఉండలు, చిన్నప్పటి నుంచి ఆకు కూరలు, సీ విటమిన్స్ ఆహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బయట దొరికే ఆహార పదార్థాలు తినకూడదని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒ. కోటేశ్వరి, కె. ఝాన్సీ పాల్గొన్నారు.

ఎంటర్‌పెన్యూర్‌షిప్ అభివృద్ధిలో సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యం

గుంటూరు రూరల్: ఎంటర్‌పెన్యూర్‌షిప్ అభివృద్ధిలో సాఫ్ట్ స్కిల్స్ ఎంతో అవసరమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల డీన్ సీహెచ్. చిరంజీవి తెలిపారు. నగర శివారు లాం ఫాం నందున్న హోమ్ సైన్స్ కళాశాలలో గురువారం అగ్రి గ్రాడ్యుయేట్లలో ఎంటర్‌పెన్యూర్‌షిప్‌కు అవసరమయ్యే సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధికి ఒక్కరోజు వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్, గ్రూప్ యాక్టివిటీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, టీమ్ బిల్డింగ్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరాలయానికి వెండి త్రిశూలం, శ్రీ చక్రం బహూకరణ



గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వరాలయానికి గురువారం గ్రామానికి చెందిన భక్తులు అల్లం తిరుపతిరెడ్డి దంపతులు అరకిలో బరువున్న వెండి త్రిశూలం, భవనం సాంబిరెడ్డి దంపతులు కేజీ 700 గ్రాముల వెండి శ్రీ చక్రం, శ్రీచక్ర పళ్లెంను ఈవో జె. సాయివిశ్వనాథం సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పవన్ కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి, వారికి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి, అప్పిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన కోటేశ్వరరావు, సురేష్

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై కోయవారిపాలెం నుంచి ప్రత్తిపాడు వైపు వస్తున్నారు. అదే సమయంలో అటు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న సురేష్ వెనుక నుంచి ముందు వెళుతున్న టూవీలర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు కోటేశ్వరరావుతో పాటు సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం, సర్పంచ్ గేరా జ్యోతి

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వం, దాతల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో,ఇతర రంగాల్లో రాణిస్తారనే ఉద్దేశంతో పదవ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. సర్పంచ్ గేరా జ్యోతి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పది పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఎంఈఓ కెఎఫ్.కెనడీ, గేరా రత్నం, తన్నీరు సుబ్బారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, షేక్ అసదుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- తోకావారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన



వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని, అందిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాల్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వ మని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని తోకావారిపాలెంలో గురువారం గ్రామ సర్పంచ్ దొడ్డా సామ్రాజ్యం ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అని ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. తమ ఇంటి వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు సాదర స్వాగతం పలికారు. ప్రభుత్వం ద్వారా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల్ని, ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వారికి వివరించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం అందించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని తెలిపారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల్ని ఏర్పాటు చేసి వారికి అనుకూలమైన వారికే, అదీ కూడా ఒక వర్గానికి మాత్రమే పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందజేసిందని విమర్శించారు. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్ని టీడీపీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. నేడు జగనన్న వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల్ని ఇంటి వద్దకే అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సచివాలయాల్ని ఏర్పాటు చేసి గ్రామంలోనే ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీడీవో శోభారాణి, ఏవో సుబ్రహ్మణ్యం, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, తురకపాలెం సొసైటీ చైర్మన్ తంగెళ్ల నాగేశ్వరరావు, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, సర్పంచులు డబ్బూరి సూర్యప్రకాశరావు, ఆరుదల సాంబశివరావు, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, రాంజీ అంబేడ్కర్, వెంకటరావు, జాన్‌బాబు, కందుకూరి జ్యోతి, నల్లమేకల మాధవరావు, వంగా నవీన్‌రెడ్డి, మబ్బు సుధాకర్, దగ్గుల మల్లికార్జునరెడ్డి, ఐలం భాస్కరరావు, నాగిరెడ్డి, పాపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు శివరాత్రి శోభ

- శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు
- జాగారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న దేవస్థాన కమిటీలు



నూతన శోభను సంతరించుకున్న ప్రత్తిపాడు శివాలయం

ప్రత్తిపాడు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 18న శనివారం శివరాత్రి పర్వదినం కావడంతో శైవ క్షేత్రాల్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రంగులు వేయించి, పరిసరాలను పరిశుభ్రం చేయిస్తూ దేవస్థాన కమిటీ సభ్యులు, దేవదాయ అధికారులు పనుల్ని ముమ్మరం చేశారు.

ప్రత్తిపాడు శివాలయంలో శాంతి కల్యాణం

స్థానిక శ్రీ గంగా పార్వతీసమేత దండేశ్వరాలయం నూతన శోభను సంతరించుకుంది. మహా శివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు పంచామృత అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రవారాభిషేకాలు, రాత్రి ఎనిమిది గంటలకు విశ్వబ్రాహ్మణుల అఖండ జ్యోతి, పది గంటలకు శాంతి కల్యాణం, పన్నెండు గంటలకు మహాశివునికి లింగోద్భవకాలంలో అన్నాభిషేక కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు పత్తిపాటి పరమేశ్వరశర్మ నేతృత్వంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ బాపతు మోహన్‌రెడ్డి చెప్పారు. శివరాత్రి రోజున జాగారం చేసేందుకు వీలుగా భక్తులకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. శివరాత్రికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనుండటంతో ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.


క్రికెట్ విన్నర్ రోలింగ్ ట్రోఫీ విజేత ఆర్‌వీఆర్‌జేసీ



ట్రోఫీని సాధించి ఏఎన్‌యూ జట్టులో ఎంపికైన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బాపట్లలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ బాలుర పోటీల్లో తమ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి విన్నర్ రోలింగ్ ట్రోఫీని కైవశం చేసుకుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ ట్రోఫీని గెలుచుకోవడంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ముగ్గురు విద్యార్థులు ఎం.సత్యనారాయణ, ఎస్. శివాజీ, ఎ. శ్యామ్ ప్రకాష్ ఏఎన్‌యూ బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. బెంగుళూరులోని రెవ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనవర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ జట్టు తరఫున ముగ్గురు క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ట్రోఫీని సాధించి, ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైన విద్యార్థుల్ని కళాశాల ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, పీడీ పి. గౌరీశంకర్ ప్రత్యేకంగా అభినందించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి

గుంటూరు రూరల్: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్. చైతన్యకుమారి తెలిపారు. లాంఫాంలోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ మిల్లెట్స్ ఇయర్ సందర్భంగా చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ దేశంలో అనాదిగా రైతులు పండిస్తున్న సంప్రదాయ పంటల్లో చిరుధాన్యాలు ప్రధానమైనవని తెలిపారు. వీటిల్లో అధికంగా పీచు పదార్థం, మెగ్నీషియం, ఐరన్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని తద్వారా మనిషి ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి బయటపడేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి దేవిరెడ్డి కిరణ్మయి, కె. ధనశ్రీ, ఎం. శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ మహిళ మృతి



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వచ్చిన ఓ మహిళ కళ్లు తిరిగి కింద పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. ప్రకాశం జిల్లా బెస్తవారి పేట ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వానా(36), భర్త షేక్ ఖాజా బుధవారం గుంటూరులోని వారి పిల్లల వద్దకు వచ్చారు. వారితో మాట్లాడి రిజ్వానాకు షుగర్ టెస్ట్‌లు చేయించుకున్నారు. గురువారం రైలు నంబర్ 17261 (తిరుపతి ఎక్స్‌ప్రెస్)కు తిరుగు ప్రయాణం అయ్యేందుకు భార్యాభర్తలు గుంటూరు రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకున్నారు. రైలు సాయంత్రం 4.30 గంటలకు స్టేషన్‌కు చేరుకున్న తర్వాత ఎక్కారు. ఈ సమయంలో షేక్ రిజ్వానాకు కళ్లు తిరిగినట్లు ఉండటంతో తోటి ప్రయాణికులు సహాయంతో కిందకు దింపారు. ఫిట్స్ లాంటివి వచ్చినట్లు ఉన్నాయని కొంత మంది ప్రయాణికులు భావించి సపర్యలు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని రిజ్వానాను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

స్పందించిన రైల్వే జీఆర్పీ పోలీసులు

సాయంత్రం 4.45 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కూడా స్టేషన్ అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకపోయినప్పటికీ మానవతా దృక్పథంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. ఆ తరువాత రాత్రి 8.45 గంటలకు స్టేషన్ అధికారులు పనులు అన్ని పూర్తి చేసుకుని ఆర్‌పీఎఫ్‌కు ఫిర్యాదు చేసినట్లు రైల్వే పోలీసులు చెబుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేటలో నివసించే కోటా మణికంఠ(26) వ్యాపారంలో నష్టం వచ్చి మానసికంగా కృంగిపోయాడు. ఈ మనస్తాపం చెంది బుధవారం రాత్రి వంట గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్‌నెట్ థింగ్స్‌పై అవగాహన అవసరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్మార్ట్ జీవన విధానం, ఇంటర్‌నెట్ వినియోగం అధికంగా ఉన్న నేపథ్యంలో ఇంటర్‌నెట్ థింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఐటీటీ ఫర్ టెక్నికల్ అప్లికేషన్స్ స్మార్ట్‌లైఫ్ ఇన్ ఐటీ హబ్స్, ఇంటర్ నెట్ థింగ్స్, సెన్సార్, మాచ్యువేటర్స్, స్మార్ట్ హోమ్స్, రిమోట్ కంట్రోలింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధికరమైన సంఘానికి ఉపయోగపడే విధంగా స్మార్ట్ విధానం, పద్ధతులు తయారు చేస్తూ ఆదర్శంగా ఎదగాలని తెలిపారు. ఇలాంటి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థులు నైపుణ్యాల్ని మెరుగు పరచవచ్చని కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ జె. భార్గవ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 185 మందికి పరీక్షలు



గుంటూరు రూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా సమగ్ర ప్రభుత్వ వైద్యశాల, శ్రీ ప్రియాంక మహిళా మండలి, బెరకా అపోస్తలిక్ చర్చి సంయుక్త ఆధ్వర్యంలో 26వ డివిజన్ పరిధిలోని దాసరిపాలెం, సీఆర్‌నగర్‌లలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ బి. సుప్రజ, డాక్టర్ పవన్, డాక్టర్ ఎం. హారిక గ్రామంలోని 185 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 25 మందికి చికిత్సల నిమిత్తం జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పాషా, సుచరిత, కె. పద్మావతి, పాస్టర్ సుధాకర్, స్పందన గ్రేస్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఆలయంలో చోరీ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణబాబు కాలనీలో శ్రీఅభయ గణపతి ఆలయంలో ఆలయ ధర్మకర్త నరసింహస్వామి బుధవారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళారు. గురువారం తిరిగి ఆలయానికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయంలో హుండీ కనిపించలేదు. అందులోని సుమారు రూ.10వేలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వసంతరాయపురంలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ జనభేరి పోస్టర్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: బీసీ జనభేరి పోస్టర్‌ను స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సేన జిల్లా అధ్యక్షులు గోలి నాగకుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న గుంటూరు జిల్లా మంగళగిరిలో వాక్కుల కోసం హక్కుల సాధన కోసం బీసీ జనభేరి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లికార్జునరావు, ఆంజనేయులు, కుంచాల కిషోర్, విజయలక్ష్మి, వేముల రాము, మణికంఠ, ప్రతాప్ రాజు, తురక రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడే అధికారులపై చర్యలు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి





సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న అధికారుల్ని ఉపేక్షించేది లేదని, తగిన చర్యలు తీసుకుంటానని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పొన్నూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో కొంత మంది సిబ్బంది నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని, వివక్ష చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో మూడు రాజధానుల మేనిఫెస్టోతోనే..

రానున్న ఎన్నికల్లో మూడు రాజధానుల మేనిఫెస్టోతోనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తారని ఎమ్మెల్యే రోశయ్య అన్నారు. పొన్నూరులో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరామకృష్ణ కమిటీ నివేదికలో పేర్కొన్న విధంగా మూడు రాజధానులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ పట్టణం, అమరావతి, కర్నూలు మూడు ప్రాంతాల అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ఏసీ కల్యాణ మండపం ప్రారంభం

సహస్రలింగేశ్వర, వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ఏసీ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.50లక్షలతో ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ట్రస్టు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో పెనుమార్పులు

విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెనుమార్పులు తీసుకువచ్చినట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పొన్నూరు పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూలులో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ విద్యారంగానికి రూ.58వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి పేద విద్యార్థులకు దూరం చేసిందని విమర్శించారు. విద్యకు పేదరికం అడ్డురాకూడనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్నారని వివరించారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్థానిక స్కూలులో ఉర్దూ సెక్షన్ ఏర్పాటుతో పాటు ఉర్దూ పోస్టును మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజస్థాన్ రాష్ట్రంలో గత నెలలో జరిగిన అంతర్జాతీయ జంబూరి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఆంజనేయులు, రాజు, ఆదికేశవులు, ప్రవీణ్‌కుమార్, మేఘనాథ్‌లను అభినందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ డైరెక్టర్ షేక్ సైపుల్లా, స్థానిక పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కులమతాలు, పార్టీలకతీతంగా పథకాల వర్తింపు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే

చేబ్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల్ని అందించడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు–4 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. పాతరెడ్డిపాలెంలోని వివిధ ప్రాంతాల్లో రెండో రోజు అధికారులు, నాయకులతో కలసి విస్తృతంగా పర్యటించారు. మహానేత వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటించారు. అందరినీ ఆత్మీయంగా పలకరించారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. స్థానికులు డ్రెయినేజీ, విద్యుత్, రహదారుల సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వెంటనే వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి వద్దకే పథకాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, మండల స్థాయి, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

పాతరెడ్డిపాలెంలో దీర్ఘకాలంగా రైతులు, స్థానికులు ఎదుర్కొంటున్న ఎద్దుల డొంకను అభివృద్ధి చేసి గురువారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభోత్సవం చేశారు. మండల పరిషత్ నిధులతో డొంక రోడ్డు నిర్మాణ పనుల్ని పూర్తి చేయడంతో రైతులకు, మూడు ప్రాంతాల వారికి మేలు జరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జోసఫ్ నగర్‌లో సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి అవడంతో వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు.

మాటలు కాదు.. ప్రోగ్రెస్ కావాలి

కొండేపాడు సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి ఆగ్రహం



సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి

కొండేపాడు (ప్రత్తిపాడు): 'నాకు కావలసింది మాటలు కాదు.. ప్రోగ్రెస్' అంటూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి అన్నారు. మండలంలోని కొండేపాడు జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను గురువారం ఆయన ఎంపీడీవో, హౌసింగ్ ఏఈలతో కలసి పరిశీలించారు. ఒకే ఒక్క ఇల్లు నిర్మాణం పూర్తయి ఉండటం, మిగిలినవన్నీ పునాదుల దశలోనే ఉండటంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్‌ను ప్రశ్నించారు. లేఅవుట్‌లోని అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనాలు దిగబడేలా ఉన్నాయని, మెటీరియల్‌ను తోలుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని వెంకట్ చెప్పారు. దీంతో ఈ కాలంలో వాహనాలు దిగబడేలా ఉండటమేంటని, ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు పడితే పరిస్థితి ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. పొక్లెయినర్‌తో ఒక గంట రెండు గంటల పాటు పనులు చేయించి ఎత్తుపల్లాలను సరిచేయిస్తే సాఫీగా వాహనాలు లేఅవుట్ లోపలకు వస్తాయి కదా అంటూ డీపీవో మరోమారు ప్రశ్నించడంతో వారి నుంచి సమాధానం కరువైంది. సర్పంచ్‌తో చెప్పి వెంటనే పనులు చేయించి ట్రాక్టర్లు వచ్చేలా చేయించాలని సెక్రటరీకి సూచించారు. సర్పంచ్ నిధుల సమస్య ఉందని చెబుతున్నారని సెక్రటరీ శ్వేత డీపీవోకు చెప్పారు. పది వేలు కూడా అవ్వని పనులకు కూడా ఇలా చెబితే ఎలాగని, ముందు అత్యవసరంగా పొక్లెయినర్‌ను పిలిపించి రోడ్డు బాగు చేయించాలని ఆదేశించారు. సర్పంచ్ డబ్బులు ఇవ్వలేను అని అన్న పక్షంలో తన జీతం నుంచి ఇస్తానని చెప్పారు. సోమవారానికి ట్రాక్టర్ తిరిగేలా రోడ్డును బాగు చేస్తే చాలని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మోషె, హౌసింగ్ ఏఈ సురేష్ తదితరులున్నారు.